# స్వస్తి

రవి కిరణాలు సూటిగా చెట్ల మధ్యనించి తొంగి చూస్తున్నా సూతమహాముని మాత్రం ఆ రోజు ఇంకా సరయూ నదీ తీరానికి రాలేదు.

"నిన్న ఆయన ఎన్నారై పురాణం కథలు చెబుతున్నప్పుడే అనుకున్నాను, అంత ఉత్సాహంగా లేరు, సుస్తీ చేసిందేమోనని" అన్నాడు శుకమహర్షి.

"అవును. నేనూ అదే అనుకున్నాను. అదీకాక రేపటి నించీ మళ్ళీ ఆయన తపస్సమాధిలోకి వెళ్ళాలి కూడాను" అన్నాడు శౌనకుడు.

"ఈలోగా మనం ఊరికే జుట్టు పూడేలా, గడ్డాలు దువ్వుకుంటూ అలా కూర్చోవటం ఎందుకు గురువుగారూ! నాలాంటి చిన్నవాళ్ళ బుర్రల్లో ఎన్నో పెద్ద ప్రశ్నలు తొలిచేస్తున్నాయి. మీలాంటి పెద్దలు వాటికి సమాధానాలు చెబితే బాగుంటుందని మా అందరి అభిప్రాయం" అని తన అభిప్రాయం చెప్పాడు చిన్నముని.

"అవును. చిన్నముని అభిప్రాయమే మా అభిప్రాయం కూడానూ!" అన్నది నల్లకోతి, తన అభిప్రాయం చెప్పి, కిచకిచా నవ్వుతూ.

శుకమహర్షి శౌనకుడివేపు చూశాడు ఏంచేద్దామని.

శౌనకుడు అందరి వేపూ ఒక్కసారి పరికించి "అవును. సూతమహాముని ఈ రోజు వస్తారని నేను అనుకోవటం లేదు. ఆయన రేపు ఉదయమే తపస్సమాధిలోకి వెడతారు కనుక, ఇక కొన్నాళ్ళు ఈ ఎన్నారై కథలు చెప్పుకోటానికికూడా వీలుండదు. చిన్నమునీ, తదితరులూ కొన్ని ప్రశ్నలడగాలన్నారు కనుక, వాటి గురించి మనం ఈ రోజు మాట్లాడుకుందాం. నేనూ శుకమహర్షీ మీ ప్రశ్నలకు జవాబులు చెప్పటానికి ప్రయత్నిస్తాం. మాకు తెలియని పక్షంలో భూలోకం లోని ఎన్నారైల మనసుల్లోకి

వెళ్ళి వాటికి జవాబులు తెలుసుకుందాం. ఏమంటారు?" అన్నాడు.

అందరూ ఉత్సాహంగా అలాగే అని అరిచారు ఒకేసారి.

"ఎక్కడ ప్రారంభిద్దాం?" అన్నాడు శుక మహర్షి.

"ఎక్కడో ఎందుకు? ఇక్కడే" అన్నాడు చిన్నముని.

శుకుడు చిన్నగా నవ్వి "అయితే నీతోనే ప్రారంభిద్దాం. నీ అనుమానమేమిటో చెప్పు" అన్నాడు.

చిన్నముని కచేరీ చేసే ముందు బాలమురళీకృష్ణలా గొంతు సవరించుకుని "మరి చాలమంది భారతీయులు అమెరికా, యూరప్, సింగపూర్‌లాటి దేశాలకువెళ్ళి, తమ సాంకేతిక విజ్ఞానంతో, వ్యాపార దక్షతతో, ఎంతో విజయం సాధిస్తున్నారు కదా, మరి వాళ్ళు వాళ్ళ స్వదేశంలో అంతగా ఎందుకు ముందుకు పోలేకపోతున్నారు. వారి తెలివితేటలు విదేశీయులు వాడుకుంటున్నట్టు స్వదేశీయులు ఎందుకు వాడుకోవటం లేదు? ఇంగ్లీష్‌లో దాన్నే బ్రైన్ డ్రైన్ అనో ఏదో అంటారుట కదా!" అన్నాడు.

శౌనకుడు ఒక్కక్షణం ఆలోచించాడు. "చాల మంచి ప్రశ్నని అడిగావు నాయనా! దీనికి జవాబు చాలా సులభమైనదే. కానీ దాని ఫలితాలు మాత్రం భారతదేశాన్ని ప్రగతి పథంలో ముందుకు పోవలసినంతగా తీసుకుపోవటం లేదు" అన్నాడు.

చిన్నముని అర్థంకానట్టు కళ్ళు చిట్లించాడు.

శుకుడు చిరునవ్వి ఇలా అన్నాడు. "భారతదేశంలో ఏ మంచిపని చేయాలన్నా అన్నీ అడ్డంకులే. యూనివర్సిటీలు, పరిశ్రమలు చాలవరకూ స్వార్ధపరులైన రాజకీయ నాయకుల చేతుల్లోనూ, లంచగొండి ప్రభుత్వం చేతుల్లోనూ నడుస్తున్నాయి. వాళ్ళకి ఎవరికీ దేశం కానీ, దేశ క్షేమం కానీ అక్కర్లేదు. ప్రతి దానికీ పర్మిషన్లు లైసెన్సులు. గవర్నమెంట్ వేలు పెట్టని చోటులేదు. గవర్నమెంటులో లేని రాజకీయనాయకులు కూడా తమ పరపతిని ఉపయోగిస్తూనే వుంటారు. లంచాలు, కులాలు, మతాలు, డబ్బు, పరపతి నడిపించినట్టుగా రీసెర్చి, టెక్నాలజీ, సైన్స్, మార్కెట్, ప్రాడక్ట్‌లు ఇండస్ట్రీని నడిపించవు. అటు చూడు. ఆయన మైక్రోవేవ్ ఒవెన్స్ తయారు చేసే కంపెనీ పెడదామని, తనని ఆదరించిన అమెరికాని వదిలిపెట్టి, తన కష్టార్జితం అంతా తీసుకు వెళ్ళి, ఆరు నెలలు ఆ లైసెన్సుల నాన్సెన్స్‌లో నానాబాధలూ పడి, తల తిరిగిపోయి, చేతిలో డబ్బులన్నీ వదిలించుకుని వెనక్కి తిరిగి వచ్చాడు"

"మీరు ఎన్నారై కథల్లోనించి గవర్నమెంటాలిటీ కథల్లోకి వెడుతున్నారేమోనని నాకు కొంచెం అనుమానంగా వుంది గురువుగారూ!" అన్నాడు చిన్నముని, ముఖంలో తన అనుమానాన్ని స్పష్టంగా చూపిస్తూ.

"ఒకళ్ళెవరో అలా తిరిగి వచ్చారని, అందరూ అలాగే ఇబ్బంది పడుతున్నారనటం భావ్యం కాదని నా ఉద్దేశ్యం. అదీకాక ఈ మధ్య శ్రీ ప్రభుత్వంవారు ఇలాటి వాటిల్లో రూల్సుని కొంచెం సడలించారని పేపర్లో చదివాను" అని, అటూఇటూ చూసి "చదవటమంటే నేను చదివానని కాదు. ఎవరో చదువుతుంటే విన్నాను" అన్నది, పురి విప్పుకుని నృత్యం చేస్తున్న నెమలి, కాసేపు ఆ డాన్స్ ఆపేసి.

ఈసారి శౌనక మహాముని ఇలా అన్నాడు. "అవును! ఇండియన్ గవర్నమెంట్ రూల్సుని సడలించిందని పబ్లిసిటీ ఇవ్వటం నిజమే. ఎనభైలలో ఇండియా ఎలక్ట్రానిక్స్ రివల్యూషన్లో చాల ముందుకి పోతుందని నిపుణులు అంచనా వేశారు. అది జరగలేదు. జపాన్ తైవాన్ కొరియా సింగపూర్ హాంకాంగ్ మొదలైన దేశాలు ముందుకు పెడుతుంటే, చూస్తూ వూరుకున్నది ఇండియా. తొంభైలలో సెమీ కండక్టర్, సాఫ్ట్వేర్ ఇండస్ట్రీలలో ఇండియా ప్రథమ స్థానంలో వుంటుందని నిపుణులు అంచనా వేశారు. దాన్ని మళ్ళీ తప్పని నిరూపించింది ఇండియా. చైనా, కొరియా, తైవాన్, సింగపూర్, మలైసియాలు సెమీ కండక్టర్ ఫాబ్స్లో, జపాన్ అమెరికాలను మించి పోయాయి"

"అలా ఎందుకు జరిగిందంటారు?" అన్నది చెట్టు మీది రామచిలుక.

"ప్రతి సెమీకండక్టర్ ఫాబ్కి నీళ్ళూ, ఎలక్ట్రిసిటీ చాలా కావాలి. చాలా అంటే రోజుకి 40 వేల మంది మనుష్యులకి కావలసినన్ని నీళ్ళూ ఎలక్ట్రిసిటీ. ఎన్నో బిలియన్ల డాలర్ల ఖర్చుతో మొదలుపెట్టిన ఆ ఫాబ్స్లో ఒక్క క్షణం కూడా ఉత్పత్తి ఆగకూడదు మరి. అదీకాక సెమీ కండక్టర్ చిప్స్ని, దుమ్ముధూళి ఏమీ లేని క్లీన్ రూమ్స్లో చేయాలి. అవన్నీ సమకూర్చేందుకు భారతదేశం ఇంకా సిద్ధంగా లేదు"

"సాఫ్ట్వేర్లో మాత్రం ఇండియా ఫస్ట్. నెంబర్ వన్." ఒత్తుగా మెత్తగా పెరిగిన తన బొచ్చుని చూసుకుని మురిసిపోతూ అన్నది గొర్రె పిల్ల.

శౌనకుడు అన్నాడు "అవును నిజమే. సాఫ్ట్వేర్లో భారతీయులు మంచి నిపుణులు. కానీ అక్కడ కూడా జరగవలసిన విధంగా జరగటం లేదు. ఆ సాఫ్ట్వేర్ పనులని ఇండియాకి తెచ్చుకుని, ఆ పరిశ్రమని వృద్ధి చేసి, ఉత్పత్తులు పెంచితే, ఆ ఉద్యోగస్తులతో పాటు, భారతదేశంకూడా ఆర్థికంగానూ, సాంకేతికంగానూ ముందుకు పెడుతుంది. ఇండియా సాఫ్ట్వేర్ ఎగుమతులు చేయటంలేదని కాదు. చేయవలసిన దానిలో ఒక చిన్న వంతు కూడా చేయటం లేదని. సాఫ్ట్వేర్ డెవలప్మెంట్లో ఎంతో ముందున్న ఇజ్రేయిల్ అదే చేస్తున్నది ఇప్పుడు. అక్కడికి వెడితే టెల్ అవీవ్ నించీ, హైఫా దాకా ఎన్ని సాఫ్ట్వేర్ కంపెనీలు కనిపిస్తాయో. ఇండియాలోలాగా, వాళ్ళు సాఫ్ట్వేర్ ఉద్యోగుల్ని ఎగుమతి చేయరు. సాఫ్ట్వేర్ ప్రాడక్టుల్నీ, సర్వీసెస్నీ ఎగుమతి చేస్తారు. దానివల్ల లాభం,

ఆ దేశంపొందుతుంది. అమెరికాకీ, మిగతా దేశాలకీ వలస వెళ్ళే కొంతమంది వ్యక్తులు మాత్రమే కాదు"

"మరి ఎందుకు జరుగుతున్నది అలా..." అని అడిగింది గౌరైపిల్ల.

"దానికి చాల కారణాలున్నాయి. ముఖ్యంగా ప్రచారం ఎక్కువ, కార్యాచరణ తక్కువ అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఇందాక మనం చెప్పుకున్నామే. ఈ రంగంలో కూడా అదే గవర్నమెంటాలిటీ. కాకపోతే కొంచెం గుడ్డిలోమెల్ల. ఎన్నో కోట్ల డాలర్లు ఖర్చు పెట్టి, తమ కంపెనీలని భారతదేశంలో పెట్టుకుందామని వచ్చేవారిని రెడ్‌టేప్‌తోనూ, లంచాలతోనూ వేధించటం. అన్నిటికీ మించి, పరిశ్రమలకి ఎంతో అవసరాలైన మంచినీళ్ళు, కరెంటు, టెలిఫోన్, చక్కటి హైవే రోడ్లు లేకపోవటం. చైనా, తైవాన్, సింగపూర్, కొరియాలాటి దేశాలతో పోలిస్తే ఆ ఇన్‌ఫ్రాస్టక్చర్ అక్కడ లేకపోవటం వల్ల భారతదేశం ఎంత నష్టపోతున్నదో స్పష్టంగా తెలుస్తున్నది"

"అసలింతకీ నా ప్రశ్నకి పూర్తిగా సమాధానం చెప్పలేదు మీరు" అన్నాడు చిన్నముని చిన్నగా.

శుకుడు నవ్వి "నువ్వడిగిన ప్రశ్నలో రెండు సగాలున్నాయి. వాటిలో రెండవ భాగానికి సమాధానం ఇచ్చాం. మొదటి భాగానికి జవాబు చెబుతాను" అని ఒక్కక్షణం ఆగి ఇలా అన్నాడు. "నేను ఇందాక చెప్పానే, ఇన్‌ఫ్రాస్టక్చర్ ముఖ్యమని. ఎన్నో మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టి ప్రారంభించే పరిశ్రమలకు కావలసినదదే. అమెరికాలో కానీ, వేరే ఇందాక పైన చెప్పుకున్న ఇతర దేశాలలో కానీ, దానికి కొదువ లేదు. అమెరికాలో పరిశ్రమలు ప్రారంభించటం చాలతేలిక. కొన్ని దేశరక్షణకు సంబంధించిన వాటికి తప్ప, మిగతా దేనికీ ప్రభుత్వంతో పని లేదు. ఎలాటి లైసెన్స్‌లూ అనుమతులూ అక్కర్లేదు. తెలుగావిడ వాణీకోలా, వినోద్ ధామ్, దేష్ దేశ్పాండే, అశోక్ త్రిపాఠీ, జయశ్రీ ఉల్లాల్, సబీర్ భాటియా, సిద్ధూ- ఇలా చాలమంది భారతీయులు అమెరికాలో తమ సాంకేతిక జ్ఞానంతో స్వంత టెక్నాలజీ కంపెనీలు స్థాపించి విజయం సాధించారు. అమెరికాలో కొత్త ప్రాడక్టుల మీదా, ప్రాడక్ట్ మార్కెటింగ్ మీదా ఎక్కువ ధ్యాసపెట్టి పనిచేస్తే చాలు. మిగతా విషయాల్లో సహాయమే కానీ అడ్డంకులు రావటం అరుదు. భారతదేశంలో రాజకీయాలకి బలైన శామ్ పిట్రోడా కూడా, అమెరికాలో వరల్డ్‌టెల్ అనే కంపెనీ పెట్టి, జీవితంలో తను సాంకేతికంగా సాధించాలనుకున్నవి మళ్ళీ చేయగలుగుతున్నాడు. అలాగే రీసెర్చి రంగంలో కూడా ఎంతో మంది,కులాల మతాల ప్రమేయం లేకుండా, వాళ్ళు సాంకేతికంగా సాధించాలనుకున్నవి ఉత్సాహంతో చేయగలుగుతున్నారు. ఎంతో మంచి పేరు తెచ్చుకుంటున్నారు"

చెట్టు కింద పడుకుని, నెమ్మదిగా గడ్డి నెమరు వేస్తూ కథ వింటున్న బవిరిగేదె "చిన్నముని, చిన్నవాడయినా పెద్దప్రశ్నే అడిగాడు. ఆ జవాబు పూర్తయేలోపల, ఇక్కడున్న పచ్చగడ్డి అంతా తినలేక చచ్చాను" అన్నది.

చిన్నముని భుజంమీది తుండుగుడ్డని రెండు చేతులతో పట్టుకుని వీపు గోక్కుంటూ "అయితే ఈసారి గడ్డిలేని చోట పడుకో. ఇంకో పెద్ద ప్రశ్న అడుగుతున్నాను" అని అందరికీ కనపడేలా ఒక నవ్వు నవ్వి ఇలా అన్నాడు.

"గురువుగారూ! ఈ ఎన్నారైలు, ఎంతో కష్టపడి, అటు పేరూ ఇటు డబ్బూ సంపాదించుకుంటున్నారు కదా. మరి వాళ్ళ దేశానికి ఏమన్నా తిరిగి ఇస్తున్నారా?"

శౌనకుడు చిన్నగా నవ్వి "ఇంకొళ్ళకి తమ చాతనయిన సహాయం చేయటం, ఆదుకోవటం మానవధర్మం నాయనా. ఎన్నారైలు కూడా ఈ విషయంలోయథాశక్తి తమ ధర్మం నెరవేస్తున్నారని నా ఉద్దేశ్యం. ఈ విషయంలో ఉత్సాహంగా వుండే నాకు తెలిసిన ఒక కథ చెబుతాను. దాదాపు ముప్పై సంవత్సరాలకు ముందర, అంటే 1968లో జరిగిన విషయమిది. భాగవతుల పరమేశ్వర్రావుగారనే ఒక మానవతావాది ప్రారంభించిన యజ్ఞమది. ఆయన పిహెచ్డి చేసి, ఉద్యోగం చేసుకుంటూ, అమెరికాలో సుఖంగా వున్నరోజులవి. ఆయనలో సాంకేతికంగా ఎదిగిన న్యూక్లియర్ కెమిస్ట్రీలో పిహెచ్డి, అమెరికాలోనే వుండి రీసెర్చిచేసుకోమంటున్నా, ఆయనలోని మనిషికి మాత్రం ఆ మాటలు నచ్చలేదు. మంచిఉద్యోగాన్నీ ఆస్తిపాస్తుల్నీ, ఆఖరికి తనవాళ్ళని కూడా అమెరికాలోనే వదిలేసి, తన స్వంత ఊరయిన విశాఖపట్నం జిల్లాలోని డిమిలి అనే గ్రామానికి వెళ్ళిపోయాడు. అక్కడ ప్రజల జీవన సరళి చూసి ఆయన హృదయం కరిగిపోయింది. అమెరికాలో పెద్ద చదువులు చదివి, తిరిగి వచ్చిన ఆయన్ని తమలో ఒకడిగా చూడటానికి ఆ ఊరి పజలకు నమ్మకం కలగలేదు. ఆ రోజుల్లో ఆయన దగ్గరకు చేరినవి, ఆయన ఏర్పరచుకున్న గుడిసెలో వున్న పాములూ తేళ్ళూ మాత్రమే. అయినా ఆయన పట్టుదల వదలలేదు. ముందుగా ఆయనెంతో కష్టపడి అక్కడొక స్కూల్ ప్రారంభించాడు. అశోకుడు చక్రవర్తి కనుక మనుష్యులని పెట్టి ఎన్నోచెట్లు నాటించాడు. బావులు తవ్వించాడు. ఈయన తనొక్కడే కనుకా, చక్రవర్తి కాదు కనుకా ఆ పనులు తనొక్కడే చేయటం మొదలు పెట్టాడు. ఆయన నిస్వార్థంగా చేస్తున్న ఆ పనులు చూసి ఊళ్ళో వాళ్ళందరూ ఆయన పక్కన నిలిచారు. దాని ఫలితంగా ఆ వూళ్ళో స్కూలూ, చెట్లూ, బావులతో పాటూరోడ్లూ, వైద్య సదుపాయాలూ, అన్నీ స్వయంగా ప్రారంభించినవే, సమకూరాయి. అలాగే పొదుపు ఉద్యమాలూ, మహిళా సంక్షేమ విభాగాలు, వికలాంగుల పాఠశాలలు, ఉపాధి కల్పనా పథకాలు.... ఇలా ప్రజలలో ఒక్కసారిగా చైతన్యం

వచ్చింది. అలా ప్రారంభమైన ఆ యజ్ఞం అక్కడితో ఆగలేదు. అదే పద్ధతిలో ముందుగా ఆయన ఆధ్వర్యంలో ఎలమంచిలి తాలూకాలోని యాభై గ్రామాలకు పైన, ఇదే విధంగా ప్రగతిపథంలో పురోగమించాయి. ఆయన చెప్పేది ఒక్కటే "మీ వూరినీ, మీ జీవనసరళినీ ముందుకు తీసుకు వెళ్ళగలిగేది మీరు మాత్రమే. నాకు తెలిసిన నాలుగు విషయాలు చెప్పి నేను మీకు సహాయం చేస్తాను. అంతే. మీ ఇంటిని చక్కబెట్టుకోవాల్సిన బాధ్యత మీదే" అని. అలా అని ఆయన వూరుకోలేదు. చుట్టుపక్కల వున్న ప్రతి గ్రామం నించీ, ఉత్సాహపూరితులైన యువకులకీ, యువతులకీ, ఈ కార్యక్రమాల్లో ట్రైనింగ్ ఇవ్వటమే కాక, వాళ్ళు ఆ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, పక్కన నిలిచి సహాయం చేశారు. అలా ఎన్ని వందల గ్రామాలు ఈ మానవతా యజ్ఞంలో లాభం పొందాయో!"

"మరి ఆ కార్యక్రమాలు మీరు చెప్పినంత సులభంగా జరిగిపోయాయా?" అడిగింది, గడ్డి నెమరువేయటం అప్పుడే పూర్తి చేసిన బవిరి గేదె.

శౌనకుడు నవ్వి "లేదు. ఆయన ఎన్నో కష్టాలు పడ్డారు. స్థానిక కామందులు, గవర్నమెంటువారు, ఆఖరికి కొన్ని పత్రికలవారు, ఆయన సేవకి మసిపూసి మారేడుకాయ చేయాలని ప్రయత్నించి, విఫలులయారు. ఏది ఏమైనా ఆయన అనేది ఒకటే "ఓన్లీ ఎ జీనియస్ కెన్ కీప్ ఇండియా పూర్" అని. ఇండియాలో సహజ వనరులు నిండుగానూ, ప్రజాశక్తి మెండుగానూ వున్నాయి. ఎవరయినా ఎంతో జీనియస్‌కి తప్ప ఇండియాని ఎన్నో ఏళ్ళు పేద దేశంగా వుంచటం సాధ్యంకాదని ఆయన ఉద్దేశ్యం."

"అయితే భారతదేశాన్ని రోజు నంజుకు తింటున్న రాజకీయ నాయకులందరూ జీనియస్సులంటారు..." అన్నది బద్ధకంగా పడుకుని, తింటున్న గడ్డిని ఎడమవేపు నించీ కుడి వేపుకు నాలికతో నెడుతున్న బవిరిగేదె.

"ఏయ్! నువ్వు నోర్మూసుకో" అని కసిరి, శౌనకుడితో అన్నది చెట్టు మీద రామ చిలుక. "ఈ కథ వినటానికి చాల బాగున్నది కానీ, మీరేదో ఒకే ఒక ఉదాహరణ చెప్పి సర్దేస్తున్నారు..." అన్నది.

శౌనకుడు నవ్వి "అదికాదమ్మా చిలకమ్మా! ఎక్కడయినా మంచీ చెడూ కలిసే వుంటాయి. కొంతమంది ఎన్నారైలు వారి గ్రామాలలో, పట్టణాలలో స్కూళ్ళూ, హాస్పిటళ్ళూ కట్టిస్తున్నారు. చేతనయినంత సహాయం చేస్తున్నారు. అలాగే కొంతమంది తమ దేశాన్ని మరిచిపోయి ఏమీచేయటం లేదు. నేని పరమేశ్వర్రావుగారి భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్ కథ ఎందుకు చెప్పానంటే, ఈ కథ నాకు బాగా నచ్చిన కథ. నన్ను ప్రభావితుడ్ని చేసిన కథ. అలాగే ఈకథ మరికొన్ని హృదయాలను కూడా తాకితే, అవి స్పందిస్తే, దేశానికీ దేశప్రజలకీ కొంతన్నా ఉపకారం జరుగుతుందనే ఆశతో చెప్పాను. ఈ కథలో

ఇంకొక నీతి కూడా వుంది. ఏదన్నా సేవా కార్యక్రమం చేయాలంటే చాలమంది ముందు చందాలు వసూలు చేయటంతో ప్రారంభిస్తారు. కావలసినవి చందాలు కాదు, చేయాలనే పట్టుదలా, కష్టనష్టాలు భరించటానికి సిద్ధపడే త్యాగబుద్ధీ, తన కార్యదక్షత మీద తనకి నమ్మకం అని నిరూపిస్తుంది" అన్నాడు.

చిన్నముని ఈసారి తను ఇంకో ప్రశ్న అడుగుదామని అనుకుంటున్నానని సూచిస్తూ, చేయి పైకెత్తాడు.

శౌనకుడు అతని వేపు సాదరంగా చూసి "చెప్పు నాయనా నీ ప్రశ్న ఏమిటో?" అన్నాడు.

"ఏంలేదు గురువుగారూ! మరి ఈ ఎన్నార్రైలు అలా దేశం వదిలి వెళ్ళిపోతున్నారు కదా, కొన్నాళ్ళకు వాళ్ళకి వారి దేశాలతో బంధం తెగిపోతుందంటారా?" అని అడిగాడు.

శౌనకుడు నెమ్మదిగా అన్నాడు. "వేరే దేశాలకు చదువుకోసం వెళ్ళిన వాళ్ళల్లో కొద్దిమంది మాత్రమే వారి చదువు పూర్తవగానే వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నట్టు చరిత్ర చెబుతున్నది. అలాగే ఉద్యోగాల కోసం వలస వెళ్ళినవాళ్ళు, చాలమంది ఆ విదేశాల్లోనే స్థిరపడిపోయినట్టు కూడా తెలుస్తున్నది. ఇంకో విషయం.అలా విదేశాల్లో స్థిరపడిపోయిన వారిలో మొదటితరం వారికి, వారి దేశంతో సంబంధ బాంధవ్యాలున్నా, రెండవ తరంలో అవి పలుచబడటం, మూడోతరంలో దాదాపు పూర్తిగా మాయమవటం చూస్తున్నదే. సౌత్ఆఫ్రికా, సింగపూర్, మలైషియా, కెన్యా, మారిషస్, నైజీరియా, ఫిజీ మొదలైన దేశాల్లో వున్న రెండవ, మూడవతరం భారతీయులకు, భారతదేశంతో సంబంధాలు అసలు లేకపోవటమో, నామమాత్రంగానే వుండటమో తెలుస్తూనే వుంది. ఇప్పుడు అమెరికా, కెనడా తదితరదేశాలలో కూడా అలాగే జరుగుతున్నది"

"అయితే మరి, అమెరికాలాటి దేశాలకు, కొన్నాళ్ళు వుండి తిరిగి వచ్చేద్దామని వెళ్ళేవాళ్ళు తమ భవిష్యత్తరాల వారి గురించి ఆలోచించటం లేదంటారా?"

శౌనకుడు చిన్నగా నవ్వి అన్నాడు "అవును. కాదు. అమెరికాలాటి దేశాలకు వెళ్ళేవాళ్ళు కొన్నాళ్ళు అక్కడ వుండి వెనక్కి తిరిగి వచ్చేద్దామని అనుకునే వాళ్ళే. కాకపోతే అక్కడకు వెళ్ళిన కొద్ది సంవత్సరాల్లో, వాళ్ళ జీవితం గురించే కాక, వారి తర్వాత తరాల వారి జీవితం గురించి కూడా ఒక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వస్తుంది. వాళ్ళ పిల్లలు అప్పుడు చిన్నవయసులో వుంటారుకనుక, ఆ పిల్లల తరపున ఈ పెద్దవాళ్ళే ఆ నిర్ణయం తీసుకోవాల్సిన సందర్భాలువస్తాయి. అలా విదేశాల్లోనే శాశ్వతంగా ఆ కుటుంబాలు నివాసం ఏర్పరచుకోవటం జరుగుతున్న విషయమే!"

చిన్నముని బరబరా బుర్ర గోక్కుని, "మరి అది మంచిదంటారా? చెడ్డదంటారా?" అని చిన్నగా అడిగాడు.

శుకమహర్షి కూడా చిన్నగా నవ్వి "ఆ నిర్ణయం ఆ వ్యక్తులకు వారి కుటుంబాలకూ సంబంధించినది కనుకా, వాళ్ళ జీవితం గురించి వాళ్ళే ఆ నిర్ణయం తీసుకుంటున్నారు కనుకా, దానికి వాళ్ళే బాధ్యులు కనుకా, వాళ్ళ నిర్ణయం ఏదైనా అది వాళ్ళకు మంచిదేనని నా అభిప్రాయం!"

"మరి తమ భవిష్యత్తు గురించి నిర్ణయం తీసుకునే హక్కువుంది కానీ, వారి పిల్లల భవిష్యత్తు గురించీ, తరువాతి తరాలవారి భవిష్యత్తు గురించీ నిర్ణయం తీసుకునే హక్కు ఆ తల్లిదండ్రులకు వుందంటారా" అన్నాడు చిన్నముని.

శుకమహర్షి మందహాసం చేశాడు. "నువ్వే చెప్పు. ఆ హక్కు వుందంటావా?" అని అడిగాడు.

చిన్నముని ఒక్క క్షణం ఆలోచించాడు. "లేదని నా ఉద్దేశ్యం. ఎవరి భవిష్యత్తుకి వాళ్ళే బాధ్యులని ఇందాక అనుకున్నాం కదా! అయినా పిల్లలు పెద్దవాళ్ళయాక, ఆ పెద్దల నిర్ణయాన్ని మార్చుకుని, వాళ్ళకిష్టమైన విధంగా చేసే అవకాశం వుంది కదా. ఇలా ఈ అమెరికా, ఐరోపా దేశాలకు వెళ్ళే చాలామంది, ఎలావాళ్ళ తల్లిదండ్రులను వదిలి తమ స్వంతనిర్ణయాలని తీసుకుంటున్నారో అలాగే వారి పిల్లలూనూ" అన్నాడు.

పక్కనేవున్న కోతిపిల్ల, ఎగిరి ఒక గంతువేసి, పెద్దగా నవ్వి "చిన్నముని చూడండి ఎంత పెద్దమాటలు చెప్పేస్తున్నాడో! బాగాఎదిగాడు కదూ! ఆలోచన కూడా పెరిగింది" అన్నది.

శౌనకుడు నవ్వి "అవును. మనమీ ఎన్నారై కథలు చెప్పుకునే సమయంలో నేను గమనిస్తూనే వున్నాను. చిన్నముని ఇప్పుడు చిన్నముని కాదు. అందరిలోనూ మిన్న" అన్నాడు.

శుకమహర్షి అన్నాడు "ఇక మనం ఈ ఎన్నారై కథలు చెప్పుకోవటంపూర్తి చేసే సమయం ఆసన్నమయింది. శ్రీసూతులవారు రేపటి నించీ తపస్సమాధిలోకి వెళ్ళిపోతున్నారు. మళ్ళీ ఎప్పుడో ఈ కథలు చెప్పుకునే అవసరం వుంటే, చెప్పుకుందాం"

శౌనకుడు చిన్నగా దగ్గి గొంతు సవరించుకుని ఇలా అన్నాడు.

"అవును. పదమూడు కథల క్రితం, సూతులవారు ఎవరీ ఎన్నారైలు అనే విషయం దగ్గర మొదలు పెట్టి, ఆరోకలికాలం గురించీ, రకరకాల వ్యక్తుల గురించీ, వారి వీసాల సుఖదుఃఖాల చరిత్ర గురించీ మనకి వివరంగా చెప్పారు. విదేశాలకి వెళ్ళి వెనక్కి తిరిగి స్వదేశానికి రాలేకపోయిన వారి గురించీ, విదేశాల్లో జీవిస్తున్న అంతర్జాతీయుల గురిం

చీ, వారి జీవిత విశేషాలగురించీ, ముఖ్యంగా వారి పెళ్ళి విషయాల గురించీ తెలుసుకున్నాం. ఇటు ఎక్కడ వున్నా పిల్లల సుఖమే తమ సుఖమనుకుంటూ, అటు తమ కెంతో ప్రియమైనవాళ్ళకి దూరంగావుంటూ బాధపడే తల్లిదండ్రులు అద్దానికి అవతలి వైపెలా వుంటుందో చూపించారు. అమెరికాలోఎంతో సుఖంగావున్నారనుకుంటున్న వారి జీవితాల్లోని ఆ ఎత్తులూపల్లాలూ చూశాం. సూతులవారు హెచ్ వన్ వీసాల మోసాలను చూపించి కొత్తగా అమెరికా వెళ్ళే వారిని జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు. సూత మహాముని‌కి సుస్తీ చేయటం వలన చివరి కథని కథగా కాక, ఒక కమామిషులా చెప్పుకున్నాం. ఇప్పుడీ ఎన్నారై కథలకు సూతులవారి తరపున స్వస్తి చెబుతున్నాను.

ఆ మాటలు అని శౌనకముని లేచి నిలుచున్నాడు. ఆయన లేవటం చూసి శుక మహర్షితో పాటూ నైమిశారణ్యంలోని సర్వ జంతుజాలమూ లేచినుంచున్నాయి. చెట్టూ, చేమలూ తలలు వూపాయి.

చల్లటి సమీర పవనాలు ఆహ్లాదంగా వీస్తుంటే, మునిపుంగవులంతా నెమ్మదిగా తమ ఆశ్రమాలవేపు కదిలారు.